# షష్టిపూర్తి

"మనం కూడా ఆ వేడుక చేసుకుందాం" అంది సుందరి. సాధరంణగా పుట్టినప్పుడు పెట్టే పేర్లు పెద్దయ్యాక సార్థకం కావు. కానీ సుందరి విషయంలో మాత్రం పేరు పూర్తిగా సార్ధకమే. చెంపకి చారెడు కళ్ళు, ఎర్రటి పెదాలు, పచ్చటిరంగు, నల్లని పెద్ద వాల్జెడ- సుందరి అందగత్తే.

"మీ అమ్మ అంత నలుపుకదా, నీకింత రంగెక్కడనుంచి వచ్చింది" అన్నాడు శరత్ పెళ్ళిచూపులు చూసి పెళ్లికి ఒప్పుకున్న మరుసటి రోజు వచ్చి.

"నేను మా నాయనమ్మ పోలిక. మా నాయనమ్మ రంగేనాది. 'నువ్వు ఇంగ్లాండ్‌లో పుట్టాల్సిందానివి. ఇక్కడ ఈ ఇంజరంలో పుట్టావ్' అనేవారట మాతాతగారు" సుందరి అందమైన కళ్ళు మరీ అందంగా తిప్పుతూ మాట్లాడుతుంటే తెల్లని పలువరుస తళుక్కున మెరిసింది. అడిగిన ఒక్క ప్రశ్నకి మూడు వాక్యాల్లో చెప్పింది.

'అమ్మో....ఎంత మాటకారో' అనుకున్నాడు ఆ క్షణాన శరత్.

ఇది నలభై ఏళ్ళనాటి వెనకటి మాట. శరత్ సుందరివంకే చూస్తున్నాడు. అక్కడక్కడ వెండితీగల్లా మెరుస్తున్న తెల్లవెంట్రుకలు, కొంచెం జారిన బుగ్గలు, కంఠం కింద ముడతలు...ఇంకా అందగత్తే. "చెప్పండి మనం కూడా చేసుకుందాం."

"ఏమిటీ-ఇప్పటికి చాలాసార్లు చెప్పాను ఆ వేడుకలు అవీ నాకిష్టం వుండవని. నీక్కావాటంటే నువ్వు చేసుకో."

"బాగుంది. ఆడవాళ్ళు చేసుకునే వేడుకలేముంటాయి. సీమంతాలే. షష్టిపూర్తి ఆడవాళ్ళు చేసుకోవడం లేదుకదా" అంది భర్తకేసి చూస్తూ సుందరి.

నెలరోజులు క్రితం అన్నయ్య షష్టిపూర్తి జరిగింది. నాలుగురోజులూ ఒకటే సందడి. తన అన్నయ్య, భర్త క్లాస్‌మేట్స్, మంచి స్నేహితులు. అసలు అలాగేకదా తన పెళ్ళి కుదిరింది అప్పుడు. పై నెలలో ఈయనకి అరవై ఏళ్ళు నిండుతాయి. ఈ విషయం ఆర్నెల్లుగా అంటూనే వుంది తను. సుందరి భర్తకేసి చూసింది. "ఏమిటీ.....మళ్ళా అదే విషయమా?" అరిచాడు శరత్.

"అవును. ఏం ఎందుకు చేసుకోరూ. మీ బాబాయి-పిన్ని చేసుకోలేదా, మీబావగారు-అక్క చేసుకోలేదా? మిమ్మల్నే" సుందరి బతిమాలుతున్నట్లుగా అంది. శరత్ కూర్చున్న కుర్చీని తన్ని లేచాడు కోపంగా.

"నా ఇష్టాఇష్టాలతో పనిలేదా. అయినా ఒక్కమాట చెప్పు, నీకిష్టమని పూజలు, వ్రతాలు చేస్తున్నాను. గుడికి వస్తున్నాను. ఆఖరికి నీకిష్టమైన ఎర్రగళ్ళ చొక్కావేసుకుంటున్నాను. నీకిష్టమని నేను పరమ వ్యతిరేకించే దొండకాయ కూర కూడా తింటున్నాను. నీకిష్టమని..."

"చాల్లెండి. ఇలాంటి లిస్టు నేనూ ఇవ్వగలను. నాకిష్టం లేకపోయినా మీకిష్టమని వాల్జెడ వేసుకుంటున్నాను. మీకిష్టమని ఒక్క మాట అర్థం కాకపోయినా మీ వెంట ఇంగ్లీషు సినిమాలకి వస్తున్నాను. మీకిష్టమని మీ నాయనమ్మ చెల్లెలు ఊరు బస్సెక్కి, బండెక్కి నానా కష్టాలుపడి వస్తున్నాను. మీకిష్టమని....ఇలా నేనూ చెప్పగలను. దాంపత్యం అంటే అదేమరి. ఇష్టాలతో, అయిష్టాలతో ఒకరికొకరు సర్దుకుపోవడమే" సుందరి చేతికున్న ఎర్రటి గాజులు చూసుకుంటోంది. ఆ చేతికి ఎంత అందంగా వున్నాయో అవి.

శరత్ ఆ చేతివంక చూస్తూ "ఇంకా బోలెడు గాజులు వేసుకోవచ్చుగా" అన్నాడు నవ్వుతూ.

"చాల్లెండి. అసలు విషయం వదిలిపెట్టి గాజులు, గొలుసులు ఏమిటి?" అంది.

"నిజంగానే అంటున్నాను. ఆవిడెవరు....అద్భుతంగా పాడుతుంది చూడు....ఇంగ్లీషు, తెలుగు, మళయాళం అన్నీ....ఊ చెప్తా... ఉప్మా కాదు కాదు....ఉషా ఊతప్....ఆవిడలాగా గాజులేసుకో. పదివేలదాకా వున్నాయిట ఆవిడకి గాజులు. ఆ మధ్య ఏదో పత్రికలో చదివా" శరత్ మాటలు వింటుంటే నవ్వూ, కోపం రెండూ వచ్చాయి.

"సరేగానీ.....ఇంక నెలరోజులే కదా. మనం ఎన్నో ఏర్పాట్లు చేసుకోవాలి మరి" అంది భర్త దగ్గరగా జరిగి. శరత్‌కి నిజంగానే కోపం వచ్చింది.

"ఏమిటి మొండితనం" అన్నాడు శరత్.

"అదే నేనూ అంటున్నాను" అంది సుందరి.

లోపలికెళ్లి పది నిముషాల్లో కాఫీ కలిపి ఇచ్చింది.

"కాఫీ చాలా బాగుంది" అన్నాడు కాఫీ చప్పరిస్తూ శరత్.

"ఇవాళ కొత్తగా బావుండడమేమిటి?" అంది జడ చివర్ల అల్లుకుంటూ.

సుందరికి వున్నట్టుండి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. తనవాళ్లందరి పద్ధతి లోకంలో అందరి పద్ధతిలా వుంటుంది. ఈయన పద్ధతులన్నీ చిత్రమైనవే. అయినా ఇంత గొడవేమిటి? అరవై ఏళ్ళు నిండాక అందరూ జరుపుకుంటారు ఎంతో సంతోషంగా, ఈయన గొడవమేమిటి?

"పోన్లెండి చేసుకోవద్దు."

"హమ్మయ్య" కాఫీ కప్పు కిందపెట్టాడు శరత్.

"పోనీ కారణం చెప్పండి" అంది బతిమాలుతూ.

"నీకు తెలియదా?"

"తెలియదు."

"నాకేసి చూసి చెప్పు నీకు తెలియదా?" మళ్ళీ అన్నాడు. సుందరి మాట్లాడలేదు.

సుందరి శరత్‌కన్నా పదేళ్ళు చిన్నది. ఉన్న వయసుకన్నా తక్కువ కనిపిస్తుంది. శరత్ నలుపైనా చాలా అందంగా వుంటాడు. అయతే జుట్టు తెల్లబడిందని రంగేసుకోడం, ఆ చివర పన్ను పుచ్చిందని తీయించుకోవడం జరిగిపోయాయి. జుట్టుకి రంగేసుకునేప్పుడల్లా చాలా విచారిస్తాడు. 'ఛీ....మా మేనమామల పోలికొచ్చింది. వాళ్లందరికీ నలభై ఏళ్ళకే జుట్టు తెల్లబడడం.' నిగనిగలాడు జుట్టు, నల్లని మీసాలు తన అందం ఇప్పుడు కొంత తగ్గిపోయింది. ఇంక! శరత్ సుందరి వైపు చూసాడు.

"అర్ధమయిందా ఎందుకు వద్దంటున్నానో" అన్నాడు క్రీగంట భార్యను చూస్తూ. కోపంతో ముఖం కందిపోయింది సుందరికి. ముక్కుపుటాలు ఎర్రబడ్డాయి. గబగబా లోపలకు వెళ్లిపోయింది. శరత్ అలాగే కుర్చీలో కూర్చున్నాడు. ఈ ఆడవాళ్ళు మహా మొండివాళ్ళు. తామనుకున్న పని ఎలాగైనా సాధించాలనుకుంటారు. ఆఖరి ఆయుధం కన్నీళ్ళు.....నెత్తిమీదే వుంటుందిట నీళ్లకుండ. శరత్ ఇలా అనుకుంటూ...."సుందరీ ఇలా రా" అన్నాడు.

సుందరి వినిపించుకోనట్లు ఊరుకుంది,

"నిన్నే....వినిపించడంలేదా?"

సుందరి ముఖం చిట్లించుకుంటూ వచ్చి భర్త పక్కన సోఫాలో కూచుంది.

"నువ్వు నాకన్నా ఎంతో అందంగా, మరీ చిన్నదానిలా కనిపిస్తావు. అవునా."

"ఊ..." అంది తల వంచుకుని చీర కొంగు చివర్లు నోట్లో పెట్టుకుంటూ.

"ఇప్పుడందరికీ తెలిసిపోయేలా నాకు అరవై ఏళ్ళని నీకసలు తెలుసా! అరవై ఏళ్ళ మగాడు ముసలాడి కింద లెక్కేస్తారు లోకం అని చెప్పింది అమ్మమ్మ. అయినా నాకు అరవై ఏళ్ళు అని ఊరందరికీ చెప్పుకోవాలా?" శరత్ మాటలకి నవ్వు ఆపుకోలేకపోయింది సుందరి. పకపకా నవ్వేసింది. ఆమె అలా నవ్వుతుంటే శరత్‌కి కోపం పెరిగిపోయింది.

"నా మొగుడు ముసలాడు, నేను ఎంతో చిన్నదాన్ని నా మొగుడు జుట్టుకి రంగేసుకుంటాడు అని ఇలా..."

"ఛ అవేం మాటలూ! అరవై ఏళ్ళ వాళ్ళు అరవై ఏళ్ళ వాళ్ళలాగే వుంటారు. తప్పేమిటి?" అంది సుందరి.

"తప్పే. అరవై ఏళ్ళ వాళ్ళు ఏభై ఏళ్లవాళ్ళలాగా ఉండాలనుకోవడం తప్పుకాదూ!"

"మరి మీ వయస్సు...!"

'ఎవడో మీ అన్నలాగా తెలిసినవాడికి తప్ప తెలియని వాళ్లందరికీ నా వయసు ఏభై అయిదు దాటింది అంతే. మీ అన్నలాగా నాకేం ప్రభుత్వోద్యోగం లేదే. నా వయస్సు నా ఇష్టం" శరత్ కూడా చేయి అడ్డం పెట్టుకుని నవ్వుకున్నాడు. సుందరి పగలబడి నవ్వింది.

"ఎవరైనా వింటే నవ్వుతారు" అంది.

"నవ్వనీ. నాకు అరవై ఏళ్ళని అప్పుడే చెప్పుకోవడం ఇష్టంలేదు. ఆడవాళ్లేనా వయసు దాచుకోవడం. కనుక ఇంకోసారి ఈ విషయం ఎత్తకు."

శరత్ ఆ మాట అంటూ వీధిగదిలోంచి బెడ్‌రూమ్‌లో కెళ్లిపోయాడు. సుందరి బుగ్గన చేయి వేసుకొని 'విచిత్రమైన మనిషి' అనుకుంది.

శరత్ అలా పడుకొని ఎదురుగా అద్దంలో ముఖం చూసుకున్నాడు. తనకి అరవై ఏళ్లా? ఛీ.... తను చాలా అందమైనవాడని చాలా గర్వం శరత్‌కి. తలలో ఆనాడు రెండె తెల్లవెంట్రుకలు కనబడగానే చాలా దుఃఖపడిపోయాడు. కొంచెం పన్ను కదులుతోంది అంటే కంగారుపడిపోయాడు.

'హమ్మో...ఇప్పుడే ఊడిపోతే' అనుకుంటూ.

శరత్ ఒక నలభై సంవత్సరాలు వెనక్కి వెళ్ళిపోయాడు. తన పెళ్లిచూపులు, నల్లని వాల్జెడ ముందుకేసి కూచున్న సుందరి, ఆ తరువాత సుదీర్ఘమైన జీవితంలో ఎన్నో మలుపులు- అమ్మాయి పెళ్లి, అమెరికాలో వుండే అల్లుడు-తన మనమడు అచ్చం తాత పోలికే....శరత్ ఆలోచనల మధ్యలో ఒక్కక్షణంలో ముందుకొచ్చేసాడు.

అయినా తనకి మాత్రం అంత పట్టుదలేమిటి? తను షష్టిపూర్తి చేసుకోకపోతే తనకి అరవై ఏళ్ళు నిండనట్టా? నవ్వుకున్నాడు. పోనీ సుందరి కోరిక తీరిస్తే....నో....నో! శరత్ అటూ ఇటూ ఒత్తిగిల్లాడు.

సుందరి ఇంక ఆ విషయం ఆలోచించడం మానేసింది. గుమ్మంలో కూచుని భర్తతో కబుర్లు చెబుతూ "చూసారా ఎంత బాగా పూసాయో" అంది మల్లెలమాల కడుతూ.

ఫోను మోగుతోంది. శరత్ అలాగే కూచున్నాడు. సుందరి మాల కడుతూనే వుంది.

"ఫోన్ తియ్యండి" అంది.

ఫోన్ కట్ అయిపోయింది.

"మనతో అంత అవసరం వున్నవాళ్ళు మళ్లీ చేస్తారులే" అన్నాడు మల్లెపూలు గుప్పెడు చేత్తో తీసుకుని సుందరి పైన విసిరి, సుందరి పెద్దమాల అల్లి సగం తుంచి జడలో పెట్టుకొని, సగం దాచింది.

"ఆ సగం ఎవరికో?" అన్నాడు శరత్.

"దేవుడికి" అంది సుందరి.

ఫోన్ మోగింది. అటు మాటలు వినిపించడంలేదు గానీ ఇటు మాటలను బట్టి అది అమెరికాలో వున్న అమ్మాయి అని అర్థమయింది.

"మీ నాన్నకి ఇష్టం లేదుట. నేనేం చేయను?"

ఫోన్‌లో మాట్లాడమయింది.

'పంపించిన ఆవకాయ అందిందా, చిన్నవాడికి సిల్కులాల్చీ పట్టిందా' అనీ ఇలాంటివి మాట్లాడింది సుందరి.

"చెప్పేశాను" అంది.

"మంచి పని చేశావు. నీలాంటి వాళ్లనుచూసే చెప్పారు కరణేషు మంత్రీ అని" అన్నాడు శరత్. సుందరికి చాలా బాధగా ఉంది షష్టిపూర్తి చేసుకోకపోవడం.

పదిహేనురోజులు గడిచాయి. ఎదురుగా కేలండర్ తేదీలు బాగా చూపిస్తోంది. వాకింగ్‌కి బయలుదేరిన శరత్‌కి గుమ్మంలో నుంచున్న సుందరి చేయి ఊపింది.

"ఫోన్లే పాపం....దాని మాట ఎందుకు కాదనాలి." ఏదో మనసులో ఓ మూల నుంచి చిన్న కదిలిక వినిపించింది ఆ రోజు మార్నింగ్ వాక్‌కి వెడుతున్న శరత్‌కి. గబగబ ఇంటికి వచ్చేసాడు.

"ఇదిగో మర్చిపోయాను చెప్పడం, రవి లేడూ అదే నా ఫ్రెండు నాలుగురోజుల్లో కెనడా వెళ్ళిపోతున్నాడు. హాయిగా గడుపుదాం రమ్మన్నాడు."

"వెళ్లండి" అంది కేలండర్ వంక చూస్తూ.

"ఇద్దర్నీ రమ్మన్నాడు. పైగా మనం వాళ్ళు మద్రాస్‌లో వున్నప్పుడు ఎంత హాయిగా బీచ్‌లో గడిపేవాళ్ళం" అన్నాడు శరత్.

సుందరి మాట్లాడలేదు. సాధారణంగా శరత్ మాటకి తిరుగుండదు. వెళ్లాలంటే వెళ్లాల్సిందే.

భార్యభర్తలిద్దరూ రైల్లో కూర్చున్నారు. "మనం మద్రాస్‌కదా వెళ్ళేది.... మరి" అంది కొంచెం తికమకగా.

"నేనెక్కడికి వెళితే నువ్వక్కడికి. అంతే" సుందరి అటు ఇటూ చూస్తోంది. రైలు ఆగింది.

భర్త వెంట సూట్‌కేస్ పట్టుకుని గబగబా నడుస్తూ వున్న సుందరి ముఖం నిండా ఆనందమే.

"ఏడుకొండలవాడి సన్నిధిలో...ఆహా" సుందరి వేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుని ఎదురుగా వున్న మెట్లమీద కూచుంది. శరత్ క్యూలో నిలబడి లడ్డూలు తెచ్చాడు. ఇద్దరూ ఒకేసారి నవ్వుకున్నారు.

చటుక్కున్న శరత్ ఆశ్చర్యంగా "అటు చూడు అటు...అటు" అన్నాడు.

సుందరి చూసింది. ఎదురుగా అన్నయ్య.

"ఏమే చెల్లాయ్" అన్నాడు నవ్వి.

"మా ఫ్రెండు చెల్లెలి పెళ్లికొచ్చాం" శరత్ జనాన్ని చూస్తూ అన్నాడు.

"అవున్లే. షష్టిపూర్తిలో పెళ్ళి వుంటుందిలే."

అన్నయ్య మాటకి గలగలా నవ్వారు షష్టిపూర్తి దంపతులు శరత్, సుందరి!

షష్టిపూర్తి కథలు - ఆంధ్రభూమి సచిత్ర మాస పత్రిక జనవ2001